మొండివాడు

ఆ సాయంకాలం మూడుగంటలకు, డ్రాయింగు పరీక్షతో, ఆ సంవత్సరానికి స్కూలు మూయబడుతుంది. డిసెంబరు శలవులు ప్రారంభమవుతై. ఇది స్కూలువారి లెక్కప్రకారం.

సరిగా రెండుగంటలా పదిహేను నిమిషాలకు పరీక్షలు జరుగుతూన్న హాలులో ఒక పన్నెండేళ్ళ విద్యార్థిలేచి నిలుచున్నాడు.

"ఏం కావాలి?" అన్నాడు వాచరు ఆవలిస్తూ. డ్రాయింగు పరీక్షలంటే వాచర్లకూ నిద్రవస్తుంది.

"నేను బొమ్మ వెయ్యటం అయిందండి" అన్నాడు విద్యార్థి.

"అప్పుడే! పదిహేను నిమిషాలన్నా కాలేదింకా?"

"నేను బొమ్మ వెయ్యటం అయిందండి."

వాచరుగారు మళ్ళీ ఆవలించి, కుర్చీలోనించి లేచి, విద్యార్థి దగ్గరికి వచ్చి "ఏదీ? చూడనీ!" అని కాగితం తీసుకున్నాడు. ఆయనకు నవ్వు ఆగలేదు. "ఇదేమిటో నీకైనా తెలుసునా?"

"నాకూ తెలియలేదండీ. పెట్టె బొమ్మ గీయబోతే నవారు మంచం మాదిరిగా తయారయిందండీ. బాగుచెయ్యబోయిన కొద్దీ ఇంకా నవారు అల్లినట్లయిందిగాని పెట్టెమాదిరిగా కానేలేదండీ."

"నువ్వు కొంచెం అతిగా మాట్లాడతావు కాదూ?" అన్నాడు వాచరుగారు నవ్వటం మానేసి.

"అవునండి."

వాచరునోట మాటరాలేదు. చివరకు ఆయన ఉగ్రంగా "అరగంట దాకా నువ్వు హాలులోనించి కదలకూడదు, కూచో."

"నేనెవరికీ కాపీ అందివ్వనండీ" అంటూ విద్యార్థి పెనసలు జేబులో పెట్టుకుని ప్రయాణమైనాడు.

మళ్ళీ కుర్చీలో కూర్చుని దవడలు పడిపోయేటట్టు ఆవలించే సంకల్పంతో వెనక్కు తిరిగిన వాచరుగారు "ఏయ్ !" అని అరిచాడు. హాలంతా మారుపలికింది.

విద్యార్థి ఆగి, "నన్నేనండీ ?" అన్నాడు.

"కూర్చో, అట్లా."

"నేను పోతున్నానండీ."

"నేను వద్దని చెప్పలేదూ ?"

"నేను పోతున్నానండీ !...నన్ను ఆబ్సెంటు రాసుకోండి."

వాచరుగారికి ఎటూ పాలుపోలేదు. వెళ్ళి కుర్చీలో కూర్చొని ఆవలించటమో, వచ్చి పిల్లవాడిగూబ మెలివెయ్యటమో ! ఆయన్ను ఈ సమస్య బాధిస్తుండగానే విద్యార్థి హాలుదాటి బయటికి వెళ్ళిపోయినాడు.

బయట వరండాలో ఒక బెంచీమీద కూర్చొని ఒక మాసపత్రికలో పద్యాలు చదువుకుంటున్నాడు డ్రాయింగు మేష్టరుగారు. చక చకా వెళుతున్న విద్యార్థివంక ఆయన కళ్ళజోడు మీదుగాచూసి "ఏంరా, రాముడూ ! అప్పుడే అయిందీ ?" అన్నాడు.

విద్యార్థి ఆయన ఎదురుగా ఆగి "కాలేదండీ !" అన్నాడు.

"ఎక్కడికి పోతున్నావు ?"

"ఇంటికండి."

డ్రాయింగు మేష్టరుగారు నవ్వాడు.

"ఓరివెధవా ! నేను సంతోషించేటందు కయినా ఇంకాస్సేపు బొమ్మవేస్తున్నట్టు నటించకూడదూ ? అప్పుడే ఇంటికిపోయి ఏం చేస్తావు ?"

"ఇవాళ కాలవకుపోయి ఈత నేర్చుకోవాలండి !"

"ఈతా ! జానెడువెధవ్వు నీకీత ఏమిట్రా? పో పోకు కాలువకు"

"కాలవకు పోతానండి."

"మొండివెధవా!....ఎవరినన్నా పెద్దవాళ్లను వెంట తీసుకుపో సుమా! కాలవ లోతుగా ఉంటుంది! భద్రం!"

ఠీవిగా తలఎత్తుకుని పోతున్న రాముడివంక డ్రాయింగు మేష్టరు గారు ఆశతో చూశారు. ఆయనకూతురు సావిత్రి ఆరేళ్ళది. ఇద్దరూ ఎంత ఈడు జోడుగా ఉంటారు!

* * *

రాముడు కాలవ కట్టకువెళ్ళి, అక్కడ ఒక ఎత్తయిన కానుగుచెట్టు చిటారుకొమ్మకు ఎక్కి, ఒక పంగలో కూర్చొని ఉయ్యాల ఊగటం మొదలు పెట్టాడు. ఇంకా కుర్రాళ్లు ఎవరూ రాలేదు. రాముడు గొంతెత్తి పాడటం మొదలు పెట్టాడు.

"అబలా - యిటులా - వనులా - వెడలా - అతిసుల - భంబని - యెంచితి - వా"

బాగుంది, మైలవరం వాళ్ళ 'సావిత్రి'! ఆయమ్ముకు!

"పో, బాల - పొమ్మిక౯ - ఒహో బాల - పొమ్మిక౯!" దీనికి తాళ ప్రకారం ఊపు రావటంలేదు,'అబలా - ఇటులా -' అంటే వచ్చినట్టు.

"ఈయుగ్రా - రణ్యమున - రా, పలదు - రా, తగదు - (రా, చనదు?) - నీకుగల దు - రాశ వీడి - పో,బాల - పో, బాల - పో,బాల - ఓహో బాల - ఒహో బాల!—"

సావిత్రి అంత పిరికిదనా, యముడి నామ్మకం! మొత్తానికి సావిత్రి భలే మొండిది! దేవతలు మెచ్చారు సావిత్రి మొండితనానికి!... తన్నుకూడా అంతా మొండివాడనే అంటారు - తనమొండి తనాని క్కూడా దేవతలు మెచ్చుకుంటారేమో!....

"ఓచెట్టుమీది యమధర్మరాజా! పాట ఆపావేం?"

రాముడు కొమ్మల సందునించి కిందనుంచుని ఉన్న సుబ్బారావును చూశాడు.

"సుబ్బారావు!"

"ఏంరా, రామనాథం!"

"ఇంకా ఎవరూ రాలా?"

"వచ్చారు. వాళ్లంతా వెనకపడి బొమ్మ జెముడు పళ్లు కోసుకు తింటున్నారు."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? నోళ్లు నెత్తురు తాగినట్టు ఉండటానికి."

రాముడు కాస్సేపు ఆలోచించాడు.

"చూశావా, చిత్రం?"

"ఏమిటి?"

"నెత్తురు తాగిననాడి నోరు ఎర్రగా ఉండకపోవచ్చు."

"ఎందుచేతనో!"

"మనం పాలుతాగితే నోరంతా తెల్లగా ఉంటుందా? గోంగూర తింటే నల్లగా ఉంటుందా?"

"ఏడిచావులే, కిందికి దిగిరా."

రాముడు లాగుజేబులోనించి గోచీగుడ్డ తీసి చూసుకుని, తృప్తి పడి, మళ్ళీ జేబులో పెట్టి, మెల్లిగా చెట్టుదిగటం మొదలుపెట్టాడు.

కొద్దిసేపట్లోనే కాలవకట్టన ఏడెనిమిదిమంది కుర్రాళ్లు చేరారు. ఒకరితరవాత ఒకరు చొక్కాలాగులు విడిచేసి గోచీలు పెట్టుకుని ఎగిరి కాలవలో దూకటం మొదలుపెట్టారు. ఈతరానివాళ్లు కొంచెం పైకివెళ్లి లోతులేనిచోట దిగి నడుములోతు నీటిలో నుంచుని, ఈత వచ్చినవాళ్ల కంటె ఎక్కువ చప్పుడుచేస్తూ నీరంతా కెలుకులు చేస్తున్నారు.

రాముడు గోచీతో తయారై ఈత వచ్చినవాళ్లు దిగిన రేవుదగ్గిర నిలబడ్డాడు.

"నీవుకూడా పైకివెళ్లి గడ్డపార ఈత ఈదరాదుట్రా?" అన్నాడు సుబ్బారావు.

"ఇక్కడ చాలా లోతా?"

"చాలా! నీకు రెండింతలుంటుంది మడుగు."

"ఏదీ, ఇటునుంచి అటు చెయ్యి పైకెత్తి, ఈదకుండా నడిచి చూపించు."

"ఓ!" అంటూ సుబ్బారావు ఒకచెయ్యి పైకెత్తి కాలవను ఇటు నించి అటు దాటటం మొదలు పెట్టాడు. మూడోవంతు దూరం వెళ్ళగానే సుబ్బారావు ముక్కు నీటి అడుక్కి పోయింది. సుబ్బారావు ముక్కు మునగగానే రాముడు చేత్తో తనముక్కు మూసుకున్నాడు. అవతలి ఒడ్డుకు సామీప్యంలో సుబ్బారావు తల మళ్ళీ నీటిపైకి వచ్చింది.

"చూశావా?" అన్నాడు సుబ్బారావు రొప్పుతూ.

"చూశాను." అన్నాడు రాముడుకూడా ముక్కును వదిలిపెట్టి రొప్పుతూ. రొప్పు తగ్గిపోగానే రాముడుకూడా మెల్లిగా కాలవలో దిగటం మొదలుపెట్టాడు.

"వాడు చస్తాడ్రా!" అని ఎవరో కేకపెట్టారు.

"రాముడూ!" "రామనాథం!" "రామాయ్!" అని అందరూ తలా ఒక పెడబొబ్బ పెట్టారు.

రాముడు మోకాలిలోతు నీళ్లల్లో ఆగి "ఏమిటోయ్, అట్లా ఉలిక్కి పడతారూ?" అన్నాడు.

"ఎందుకా? చస్తావు!"

"నువు చచ్చావా?"

"నే నెందుకు చస్తానూ? నా కీతవచ్చును!"

"నువు ఈదావా? నీమాదిరిగా నీళ్ళల్లో నడిచి నేనుమాత్రం కాలవ దాటలేనూ?"

సుబ్బారావు నిర్ఘాంతపోయి రాముడివంక చూస్తున్నాడు. ఈ లోపల రాముడు గబగబా కాలవలో దిగి పోతున్నాడు. అతని తల మునిగిపోయింది. అతనిగుండె దడదడలాడటం మొదలు పెట్టింది. వెధవ గుండెకు ఎంతభయం! ఉత్త పిరికిగుండె! ఏముంది? ఇట్లాగే ఇంకా నాలుగడుగులు పోతే తనకు కాలవ అందుతుంది. రాముడు నాలుగడుగులు వేశాడు. అందలేదు. అయిదు, ఆరు, ఇంకా అందటంలేదు. ఇక ఊపిరి ఆగదు! తల పగిలిపోతున్నది. ముక్కు వదిలిపెట్టాలిసిందే. ఇంకొక్క రెండడుగులు! ఒకటి, రెండు! రాముడి అవస్థ వర్ణనాతీతం! ఇక తన ప్రాణం పోయిందనుకున్నాడు. చేతులూ, కాళ్ళూ వణుకుతున్నై. గిల గిలా కొట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నై. అధైర్య పడితే లాభంలేదు. ఒకచెయ్యి పైకెత్తాడు. చెయ్యి నీళ్ళమీద ఎంత ఉందో తెలియలేదు. చేతిని ఊపాడు. గాలిలో ఆడినట్టే ఆడింది. చల్లగాలి చేతికి తగిలింది. అమ్మయ్య! ఒక్కసారిగా అతని ముక్కుల్లోకీ, నోట్లోకీ మానెడు నీళ్లు పోయినట్టు పోయినై. ఇంకా పోతున్నై. అతనికి స్మృతి తప్పింది. ఎవరో వచ్చి తను పైకెత్తిన చెయ్యి పట్టుకోవటం కూడా అతనికి తెలియదు.

"ఏమండోయ్! ఇవాళ్ళ మీవాడికి పెద్ద గండం తప్పిందండీ! మేం వద్దని కేకలు పెడుతున్నా వినిపించుకోకుండా ఈత రానివాడు కాలవలో దిగాడండీ! మేం ఎంత వెతికినా ఎక్కడా కనబడలేదు. అవతల ఎక్కడో తేలి చెయ్యి పైకెత్తాడండీ! అప్పుడు మేం వెళ్ళి వాణ్ణి బయటికి లాగి పొట్టమీద కూచుని నీళ్ళు కక్కించామండీ!" అన్నారు స్నేహితులు రాముణ్ణి ఇంటిదగ్గర దిగవిడుస్తూ.

"గుండంలోనించి సరిగానే నడిచి వచ్చినవాణ్ణి, మోకాటి లోతు నీళ్ళల్లో చచ్చేటంత పని అయిందమ్మా! తమాషా!....ఎటు పోతున్నానో

తెలీక కాలవలో ఉత్తర దక్షిణాలుగా నడిచివుంటా. లేకపోతేనా!...." అన్నాడు రాముడు తల్లితో.

ఆవిడ తెరిచిన నోరు తెరిచినట్టుగానే ఉండిపోయింది.

* * *

స్కూలుఫైనలు క్లాసులో సైన్సు మేష్టరుగారు ఉత్సాహం కొద్దీ పిల్లకాయలకు అనవసరమైన శాస్త్రచర్చ చేస్తున్నాడు.

"పదార్థములయొక్క చర్య మహా విచిత్రంగా ఉంటుంది!...రెండు అద్దపుముక్కలు తీసుకొని అందులో ఒకదానిమీద ఒక నీటిబొట్టు వేసి, రెండవది మొదటిదానిమీద పెట్టి ఒత్తి, రెంటిమధ్యా అణుమాత్రమైనా గాలిలేని నీటిపొర ఒకటి కలిగించినట్టయితే, ఆ రెండు అద్దపుముక్కలనూ పగలదీయటానికి అనేక ఏనుగుల బలంకావాలి; కాని ఒకదాని మీద ఒకటి సులభంగా జారి వస్తుంది!....

"చిన్న పిల్లలను కొంచెం పెద్దపిల్లలు 'వీశెడు దూది ఎక్కువ బరువా? వీశెడు ఇనుము ఎక్కువ బరువా?' అని అడుగుతుంటారు. చిన్న పిల్లలు వీశెడు ఇనుమే ఎక్కువ బరువనుకుంటారు. పెద్ద పిల్లలు రెండూ సమాన మనుకుంటారు. నిజం మీలో ఎవరికైనా తెలుసునా?.... వీశెడు దూదే ఎక్కువ బరువు. దానిలోనే ఇనుములోకంటె 'మాస్' ఎక్కువ ఉంది. అయితే రెండూ సమంగా ఎందుకు తూగుతై? గాలి దూదిని ఎక్కువగా తేలిక చేస్తుంది, ఇనుముకంటె! ఎందువల్ల? దూది పరిమాణం ఎక్కువ కనక. మనిషి పరిమాణం ఏదో ఉపాయం చేత ఉన్నదానికి అనేకరెట్లు చేసి, మనిషి బరువుమాత్రం మార్చకుండా ఉంటే, మనిషి గాలిలో తేలిపోతాడు....ఇప్పుడిప్పుడు విమానాల మీదనుంచి పెద్ద పెద్ద గొడుగుగుడ్డలంటివి ఉపయోగించి గాలిలో దిగి వస్తున్నారట! ఆ

గొడుగు గుడ్డ తెరుచుకొని మనిషియొక్క పరిమాణం పెద్దది చేస్తుం దన్నమాట!....”

రాముడు సైన్సు మేష్టరు చెప్పే విషయాలు ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. రెండు అద్దాలమధ్య సన్నని నీటిపొర ఒకటి కల్పించి, కేవలం దానిపట్టుమీద అడుగు అద్దపుముక్కను పట్టుకుని, ఆకాశంలో మూడుమైళ్ళ ఎత్తున తను వేళ్ళాడుతున్నట్టూ, క్రమేపీ ఆనీటిపొర ఇగిరి పోతూండటంచేత, తను అంత ఎత్తునించీ భూమిమీదికి పడటానికి సిద్ధంగా ఉన్నట్టూ, ఇంతలో తన చేతికి ఎవరో పెద్ద గొడుగుగుడ్డ ఇవ్వగా, దాని సహాయంవల్ల తను నెమ్మదిగా, చిన్న ఈక మాదిరిగా దిగి వచ్చినట్టూ — ఆ చివర నాలుగంగుళాలు దిగటానికే నాలుగు నిమిషాలు పట్టినట్టూ — అతను ఊహించుకొంటున్నాడు.

అనుకున్నదంతా ఆచరణలో పెట్టటం ఎవరితరమూ కాదు; కొంత వరకైనా చేసిచూతా మనుకున్నాడు రాముడు.

ఇంటో తన గొడుగు ఒకటుంది. అదీకాక, వాళ్ళనాన్న ఎన్నడో కొని మూలపారేసిన పాతగొడుగు మరొకటుంది. ఆరెంటి సహాయంతో తను ఇంటికప్పుమీదనుంచి నేలమీదికి అవతరించుదా మనుకున్నాడు రాముడు. ఆ రెండుగొడుగులూ చంకనపెట్టుకుని నిచ్చెనమీదిగా అతను ఇంటికప్పుకు ఎక్కాడు. రెండుగొడుగులూ తెరిచి చెరొకచేత్తోను పట్టుకుని వాటిని గాలిలో అటూ ఇటూ ఊపాడు. మొత్తంమీద గొడు గులు గాలిని “పట్టుకో” గలుగుతున్నై. కాని బరువును మోయగలవా?

అతను రెండోఫారం చదువుతూ వుండగా, అతనికి పరీక్షలో తెనిగించటానికి ఒక ఇంగ్లీషుపద్యం ఇచ్చారు. అందులో, ఒక కుర్రవాడు గొడుగు వేసుకుని పెద్ద గాలివానలోకి రాగానే ఆ పిల్లవాణ్ణి వాయుదేవుడు ఎక్కడికో ఎత్తుకుపోతాడు — ఆ గొడుగు సహాయంతో.

తన్ను వాయుదేవుడు ఎక్కడికీ ఎత్తుకు పోనక్కర్లేదు. పేడకడి పడ్డట్టు కాకుండా, తను ఉపాయంగా ఈ కప్పుమీదినించి ఆ నేలమీదికి గద్ద వాలినట్టు వాలితే చాలును, ఒక గొడుగుకాదు, రెండు గొడుగుల సహాయంతో!

రాముడి గుండెలు "వద్దు, వద్దు; వద్దు, వద్దు" అని కొట్టుకుంటూనే ఉన్నై. కాని వెధవ గుండెలకు లెక్క చేసేదేమిటి? ఊపిరి బిగపట్టి, రెండుగొడుగులూ రెండుచేతుల్లోనూ గట్టిగా పట్టుకుని, ఇంటి కప్పు చివరనించి రాముడు గాలిలోకి ఒక్క ఎగురు ఎగిరాడు!

పడటానికి సంసిద్ధుడై ఉంటే అంత దెబ్బతినేవాడుకాడు రాముడు! కాని, ఏం జరిగిందంటే, వెధవది, ఒక్కరవ్వకూడా అనుకున్నట్టు జరగలేదు, ఏం చెయ్యాలి?....ఆ వెధవ పాతగొడుగు టప్‌మని విరిగి, పైభాగం గాలిలో తేలిపోయి. చేతులో కర్ర మిగిలింది. రెండోది పుటుక్కున వెనక్కు మణిగింది...

"అటే దెబ్బతగల్లేదు. ఉత్తబెణుకే! ఎక్కడా ఎముకలు విరగలేదు....వారంరోజులు మంచంలో కళ్ళుమూసుకు పడుకుంటే అదే సరి అవుతుంది." అన్నాడు డాక్టరు.

పాపం, డ్రాయింగు మేష్టరుగారు అకస్మాత్తుగా పోయినాడు.

"మా సావిత్రికి సంబంధం వెతకనురా, రాముడూ! అది నీకు రాసి పెట్టి ఉంది. చేసుకుంటావా?" అనేవాడు ఆయన తనతో...తమాషాకు!

అందచందాల విషయం తనకేం తెలుసుగాని, సావిత్రి తన కళ్ళకు బాగానే ఉంటుంది. సావిత్రిని చూస్తే తనకు చాలా సంతోషంగా ఉంటుంది — ఏదో ఇదిగా ఉంటుంది మనస్సులో!

సావిత్రికి పదోఏడు — పెళ్ళీడు. ఇంకా తనకు పదహారేగా! నాలుగు సంవత్సరాలదాకా తనకు పెళ్ళిగొడవే ఉండదు....అప్పటికి

సావిత్రి కాపరానికూడా పోతుంది!...సావిత్రివంటి పిల్లలకు మంచి మొగుళ్ళు దొరుకుతారు — చాలా మంచి మొగుళ్లు!...

చిత్రంగా, ఆరాత్రే అతని తలివండ్రులు అతని ఎదట అతని పెళ్లిని గురించి చాలాసేపు మాట్లాడారు. అతని నోటిదాకా వచ్చింది, "పోనీ, నేను డ్రాయింగు మేష్టరుగారి అమ్మాయిని పెళ్ళిచేసుకోనా అమ్మా" అందామని. కాని, ఏంలాభం? పెళ్ళికి బోలెడు గ్రంథంఉంది. బోలెడు డబ్బుకావాలి, బోలెడంత చాకిరీ, చుట్టాలందర్నీ పిలవటం, పురోహితులనీ భజంత్రీలనీ పిలవటం, అయిదురోజులూ ఎప్పుడేది చెయ్యాలో అది చేయించటం — ఓ! అది పెద్దవాళ్ళ పని. అందులో తన వంటి చిన్న పిల్లకాయలు, అజ్ఞానులు, కల్పించుకోరాదు. "నాకు ఆపిల్ల కావాలి!" అంటే సరా, కష్టసుఖాలు తెలియకుండా?

రాముడి ఈ ఆలోచనల్లో ఇమిడిఉన్న "ట్రాజెడి" అందరికీ సులభంగానే అర్థమవుతుంది. అయితే అందులో కొంత నిజంకూడా లేకపోలేదు. ఒక పిల్లకూ పిల్లవాడికీ ముడిపెట్టాలంటే ఎన్ని సందర్భాలు కలిసి రావాలో అతనికేం తెలుస్తుంది? అతనికి సావిత్రికంటె మంచిపిల్ల కనిపించలేదు పెళ్లాడడానికి. ఆమాట అతను తలిదండ్రులకు చెబితే వాళ్ళు పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వి ఉండేవాళ్లు. వాళ్ల అట్లా నవ్వనినాడు మనజాతి పెద్ద సాంఘిక విప్లవానికి సిద్ధంగా ఉన్నదన్న మాటే!

చచ్చిపోయిన డ్రాయింగు మేష్టరుది పురోహితుల వంశం. ఆయన తండ్రి యాచనావృత్తితో కాలం వెళ్లబుచ్చాడు. సావిత్రి మాతామహుడు ఇంకా తద్దినాలూ అవీ పెట్టిస్తున్నాడు. మనుష్యమాత్రుడికి తెలిసినంత వరకూ సావిత్రి తలివండ్రులవేపు వాళ్లకు ఆస్తిపాస్తు లుండటమూ, ఏదోవిధమైన యాచనాలేకుండా ఉండటమూ లేవు. రాముడు వ్యాపారి పిల్లను చేసుకుంటానంటే ఎంత హాస్యాస్పదంగా ఉండి ఉండేదో, సావిత్రిని చేసుకుంటానన్నా అంత హాస్యాస్పదంగానే ఉండేది.

మరి రాముడి పితామహుని ప్రపితామహుడు రెండువేల ఎకరాల భూమి తాంబూలంతో పుచ్చుకున్నాడు, తన అసమాన పాండిత్యానికి బహుమానంగా. రాముడి పితామహుణ్ణికూడా జమీందారుగారనే పిలిచేవారు.

తరవాత కొద్దికాలానికే రాముడికి పెళ్ళి కుదిరింది. ఏటి అవతల నించి వెంకటేశ్వరశాస్త్రిగారు పిల్లనిస్తానంటూ వచ్చాడు. రాముడికి మూడు సంచులు కట్నం కురిపించి, తదితర లాంఛనాలకింద మరో రెండు సంచులు ఒలకబోసి, పెళ్ళి ఖర్చులకింద మరి రెండుసంచులు ఖాళీచేసి తనకూతుర్ని, మహాలక్ష్మిని రాముడికి కన్యాదానంచేసి, పల్లెటూరిలో అయినప్పటికీ పెళ్ళి మహా వైభవంగా చేసి ఆయన తరించినవాడయినాడు. ఉభయపక్షాలవారికీ పరిపూర్ణమయిన ఆనందమయింది.

పెళ్ళి అయిన కొద్దిరోజులకే కాలేజీలో ప్రవేశించడానికి రాముడు పట్నం వెళ్ళిపోయినాడు.

ఆ డిశంబరు శలవులకు అతను అత్తవారి ఊరువెళ్ళి, ఆ మట్టి కొంపలమధ్య, ఆ పశువులమధ్య, ఆ చొప్పా, కుడితీ, పేడా వగైరాల మధ్య తన మహాలక్ష్మిని చూసుకోగానే అతని మనోనేత్రం మొదటిసారి తెరుచుకున్నట్టయింది. తనభార్యా సాక్షాత్తూ పశువుకాదేమోకాని, అంతకంటె ఆటే ఎక్కువ స్థితిలో లేదు....సావిత్రి ? చూడటానికి కళ్లేకావాలి కాని, సావిత్రిలో దేవత్వం ఉంది ! ఉన్నదని తెలుకోటానికి నిదర్శనాలూ, పరీక్షలూ అవసరంలేదు.

ఇంకా సావిత్రికి పెళ్ళి కాలేదనీ, ఒక పించను పుచ్చుకున్న తాశీల్దారుగారు (షష్టి పూర్తికాలేదు) ఆపిల్లను చేసుకోటానికి కుతూహలపడుతున్నాడనీ, బహుశా త్వరలోనే వివాహం జరగవచ్చుననీ తెలియవచ్చింది.

పట్నం బయలుదేరే రోజున రామనాధం డ్రాయింగు మేష్టరుగారి ఇంటివేపు వెళ్లాడు. వాకిలి తలుపు వేసిఉంది. అతను కొంతదూరం పైకి

వెళ్ళి మళ్ళీ అటే వచ్చాడు. వాకిట్లో అదృష్టవశాత్తూ సావిత్రే నుంచుని ఉంది. అతను లోపలికి వెళ్ళేవాడల్లే ఆగాడు. సావిత్రి అతన్ని పలకరించబోయే దానల్లే నోరుతెరిచింది. తీరా ఆమె నోటివెంట మాటా రాలేదు, అతను లోపలికి వెళ్లాలేదు - సాగిపోయినాడు తన ఇంటివేపు.

అదివరకు బయలుగా ఉన్నచోట ఇప్పుడు పెద్దగోడ నిర్మించినట్ట యింది. ఒకప్పు డతను డ్రాయింగు మేష్టరుగా రింటికి సొంత ఇంటికి పోయినట్టు పోయేవాడు. ఒకప్పుడు సావిత్రి తనతో ఎంతో స్వేచ్ఛగా మాట్లాడేది. అతనికాళ్లకేదో అడ్డం పడ్డట్టయింది. బహుశా అదేసావిత్రి నోటికీ అడ్డంపడి ఉంటుంది!

అంతలో అతనికి ఎక్కడలేని ఆగ్రహమూ వచ్చింది - ఆ కన పడని గోడమీద, తనకాళ్ళనూ సావిత్రినోటినీ కట్టేసిన ఆ ప్రతి బంధకమ్మీద. అతను చప్పున ఆగి, చరున వెనక్కితిరిగి, తిరిగివచ్చి యెకాయెకీని డ్రాయింగు మేష్టరుగారి యింట్లో ప్రవేశించి 'సావిత్రీ!' అని పిలిచాడు.

అతని హృదయం తన అసమ్మతిని సూచిస్తూ గిలగిలా కొట్టు కున్నది. కాని, రామనాథం తన పిచ్చి హృదయాన్ని - పిరికి గుండెను లక్ష్యపెట్ట దలచుకోలేదు.

సావిత్రి అతను నిలబడ్డ వసారాలోకివచ్చి అతన్నిచూసి నవ్వింది. ఆమెనవ్వు అర్థమై అతనూ నవ్వాడు.

"రా! లోపలికి రాబోయి మానేశావేం?" అన్నది సావిత్రి, అతనికి ఏవిధమైన బాధా కలగటానికి వీలులేని గొంతుతో.

అతను ఆమెను మళ్ళీ అటువంటి ప్రశ్నే వెయ్యక, "నువుపలక రిస్తే వద్దామనుకున్నాను." అన్నాడు. ఇద్దరూ మళ్ళీ నవ్వారు.

"నేను మేష్టరుగారు పోయినతరవాత ఈ ఇంటో అడుగుపెట్ట లేదు. ఏదోబంధం తెగిపోయినట్టు భావించుకున్నాను. పొరపాటున....

సంవత్సరం! నిండా ఒక్క సంవత్సరం!" అన్నాడతను, ఒక నులక మంచం వాల్చుకొని కూర్చొని.

"అవును! వారంరోజు లయింది మానాన్న ఏడూరి వెళ్ళిపోయి, కిందటి శనివారం ...శలవులకు వచ్చావా?....నీపెళ్ళి గృహప్రవేశపు ఊరేగింపు చూశాను."

రామనాథాన్ని కొరడాతో కొట్టినట్టయింది.

"నిన్నెవరూ పిలవలేదు కాదూ? నేనూ మరచిపోయినాను - పెళ్ళి సంబరంలో!" అన్నాడతను తన్ను తనే గాయం చేసుకుంటూ.

"ఓస్! దీనికేనా?"

"కాదూ?" అన్నా డతను, ఇంకా తన్ను తాను ఏమాత్రమూ క్షమించుకోలేకుండా.

"ఒక్కత్తెనే అయిపోయినాను గాని, పిలవకుండా రాకూడదా?"

"అవును సావిత్రీ!....నీ పెళ్ళి ఎప్పుడో తెలియజేస్తే నేను పట్నం నించి పిలుపు అవసరం లేకుండానే వస్తాను!"

ఆమాట నోరు జారివచ్చిన మరుక్షణం అందులో హాస్యం అతనికి అర్థమై నవ్వాడు. సావిత్రి పరధ్యానంగా ఉంది నవ్వలేదు.

రెండు నిమిషాలపాటు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"పోయి వస్తాను, సావిత్రీ! నేను సాయంకాలం బండికి వెళ్ళిపోతున్నాను పట్నం."

అతను లేచాడు. ఆమెకూడా తన పరధ్యానం కట్టిపెట్టి లేచింది. ఇద్దరూ బయటికి వచ్చారు, అతను ముందూ ఆమె వెనకా.

ఆమె వాకిట్లో ఆగింది. అతను వీధిలోకి వెళ్ళి నుంచున్నాడు.

"వస్తాను!" అన్నాడు రామనాథం. 'సావిత్రీ' అనటానికి అతనికెందుకో నోరురాలేదు. 'ఇక ఈ మనిషిని నేను చూడను!' అన్న నమ్మకం ఒకటి అతని అంతరాత్మకు కలిగిపోయింది.

సావిత్రి ఏదో అనటానికి నోరు తెరిచింది. ఆమె నోటివెంట ఏమీ రాలేదు. రామనాధం ఒక అడుగు ఆమెవేపు వేసి ఆమె చెయ్యి అయినా చివరిసారి పట్టుకుందా మనుకున్నాడు. అతనికి కాలు కదలలేదు.

బరువెక్కిన హృదయంతో అతను ఇంటివేపు సాగిపోయినాడు.

*   *   *

మహాలక్ష్మి కాపరానికి వచ్చి రెండు నెలలు కాలేదింకా. ఆ పిల్లతత్వం రామనాధానికి ఒక్క రవ్వయినా బోధపడలేదు — కొన్నాళ్ళ పాటు, తన భార్యా బహు నిబ్బరమైన మనిషి అనీ, ఆపేక్ష అంతఃకరణలు పైకి కనబడనివ్వని మనిషి అనీ అతను తన భార్యను సమర్థించు కొన్నాడు. తనకూ ఆమెకూ మనస్సులు కలిసినకొద్దీ అవన్నీ వాటంతట అవే బయట పడతవనికూడా విశ్వసించాడు. కాని, రోజులు గడినకొద్దీ ఆమెలో ఆపేక్ష అంతఃకరణలు అసలు లేవనే అనుమానం అతన్ని బాధించసాగింది.

ఆమె పశుతుల్య కావచ్చును. ఒక్కమాటతో, ఒక్క చూపుతో భావ ప్రకటన, ప్రేమప్రకటన చెయ్యటం ఆమెకు చాతకాకపోవచ్చును — పల్లెటూరి పెంపకం కనక! కాని, కేవలమూ శరీరాలకే సంబంధించిన దాంపత్య సుఖం అనుభవించటానికి పశుత్వంతో సంబంధం ఏమిటి? పశువులు సుఖించగలగటంలేదూ? తన భార్యకు అదైనా ఎందుకు చాతకాదో!

తనకు మొగుడితో ఎటువంటి అవసరమూ లేనట్టూ, అతనే పాపాత్ముడై కోరుతున్నట్టూ, అతని పాపాన అతనే పోతాడన్న ఉద్దేశంతో, తను తనశరీరం అతనివశం చేస్తున్నట్టూ కనపడేది మహాలక్ష్మి. కొత్తగా కాపరానికి వచ్చిన భార్యతో సుఖపడటానికి అతను ఘోరమైన పాపం చెయ్యవలసినట్టుగా ఉండటం అతను భరించలేక పోయినాడు.

ఆమెకు తనతో ఎటువంటి నిమిత్తమూ లేదా? తను వందసంవత్సరాలు కనిపించక పోయినా మహాలక్ష్మి జీవితానికి ఎటువంటి కొరవా ఉండదా? ఆరోజు కారోజు గడుస్తున్న కొద్దీ ఉండదనే అతనికి తోచసాగింది. అతని ఆట కట్టుబడిపోయింది. ముందెత్తు ఏమిటో అతనికి తోచలేదు; ఈ విధంగానే బతికివున్న నాలుగురోజులూ వెళ్ళబుచ్చటం తప్ప!

తనలో ఏదో ఒకరకమైన ఆవేశం ఉందని రుజువు చెయ్యటానికి మహాలక్ష్మి తనతో ఒక్కసారి గట్టిగా పోట్లాడరాదూ — ఇట్లా మంచు కుండ మాదిరిగా ఉండకపోతే?

మహాలక్ష్మికి మనుష్యులయొక్క మంచితనంలో ఏమీ నమ్మకం ఉన్నట్టు కనబడలేదు. ప్రతిమనిషి అసూయ, క్రోధం, అనృతం మొదలైనవాటితో నిండి ఉన్నట్టుగా ఆమె భావించేది.

ఒకసారి అతను ఆమెతో ఏదో చెబితే మహాలక్ష్మి నమ్మలేదు. ఆమె అనుమానానికి అతను ఆశ్చర్యపోయి "అయితే ఇంత స్వల్ప విషయానికి నీతో అబద్ధమాడుతానా?" అన్నాడు. "ఓయబ్బో! మీరేం హరిశ్చంద్ర మహారాజులా ?" అని ఆమె తిరిగి అడిగింది.

తన అత్తమామలు బాంధవ్యంచేత తనకు శత్రువులని ఆమె నమ్మకం. ఆమె ఆమాట స్పష్టంగా బయటికే అనేది; తన అత్తగారికి తన్ను కోరంటికం పెట్టటానికి మార్గాలు అన్వేషించటం తప్ప వేరే పనేమీ లేదని! రామనాథం తల్లి అమాయకురాలు. ఆమె మొదట్లో, తన మాటల్లోనించి కోడలు లేనిగూఢార్థాలు లాగుతుంటే, గుడ్లు పెట్టుకుచూసి, కోడల్ని బొత్తిగా ఏమీ అనకపోతే బాగుండదని "సరేలే! ఇహ సరే!" అని గట్టిగా మందలించి తనపని తను చూసుకునేది. రామనాథం తల్లినిచూసి జాలిపడేవాడు.

రాళ్లవంటివి అరుగుతై, నలుగురూ ఒకడిచుట్టూ చేరి "పిచ్చి, పిచ్చి" అంటే నిజంగా మతిపోతుంది. కొంతకాలానికి రామనాథం

తల్లిలో పరివర్తన వచ్చింది. కోడలు సన్నగా ఒకటి అంటే, ఆవిడ పెద్దగా పది అనటం మొదలు పెట్టింది. పెళ్లాం ఆడించినట్టు ఆడుతున్నాడనే నెపంమీద రామనాథంకూడా తిట్లుతినటం మొదలుపెట్టాడు.

కాపరానికి వచ్చిన మూడోనెలలో మహాలక్ష్మి మంచం ఎక్కింది. వారాలూ, నెలలూ గడిచినై. ఒకరి తరువాత ఒకరు ఆరుగురు వైద్యులు మారారు. ఆమె జాడ్యం ఎవరికీ అర్థంకాలేదు. మందులకూ లొంగలేదు. ఆమె మంచంలో ఎండి వరుగై పోయింది. ఎవరో మనిషి పక్కన ఉండి చాకిరీచెయ్యాలి. అత్తగారు ఆపని చెయ్యటానికి సమ్మతించలేదు. నిజానికి మహాలక్ష్మి ఆమెకు అవకాశంకూడా ఇవ్వలేదు. ఒకసారి అత్తగారు మందు నోట్లో పొయ్యబోతే "విషం కలిపావా?" అని అడిగింది!

రామనాథం అత్తవారింటికి ఉత్తరం రాశాడు, మహాలక్ష్మి మంచాన పడ్డది కనక ఎవరైనా వచ్చి ఆమెకు ఉపచారం చెయ్యవలసిందని. ఆ ఉత్తరానికి జవాబుగా మహాలక్ష్మితల్లి సౌభాగ్యమ్మగారు వచ్చింది, పిల్లలకోడల్లే, ముగ్గురు మనమలనూ ఇద్దరు మనమరాళ్లనూ వెంట వేసుకొని.

సౌభాగ్యమ్మగారు ఇంట్లో అడుగుపెట్టగానే రామనాథం ఇల్లంతా తారుమారయింది. రామానాథానికి తెలియకుండా అతను కుదిర్చిన డాక్టర్లను ఆవిడ మార్చటమూ, అసలువైద్యమే మార్చటమూ మొదలైన పనులు చెయ్యసాగింది. ఒకరిద్దరు డాక్టర్లు అతనిమీద ఎగిరిపడ్డారు కూడానూ! ఆవిడ ఈ విధంగా తన పరపతి పాడుచేస్తుంటే, ఆవిడకు మూడోతరంవాళ్లు అతని చరాస్తికి ఊహించరాని ప్రమాదాలు తెచ్చిపెట్టుతున్నారు. రామనాథానికి రెండువారాల్లో ఎవరి ఇంటోనో తను ఉచితంగా ఉంటున్నట్టుగా ఉండసాగింది!

ఒకనాడు సౌభాగ్యమ్మగారు అల్లుణ్ణి పిలిచి "చూడు నాయనా! నేను నిన్న సోది అడిగాను. అమ్మాయి జబ్బును గురించి అడిగితే వెంకటేశ్వర

స్వామి వచ్చాడు. వచ్చి, తనకు ముడుపు కట్టుకుని, ఏడు ఊళ్ల జోగి ఎత్తి, తనకొండకువెళ్ళి పిల్లనూ, నిన్నూ తలనీలాలు ఇమ్మన్నాడు." అన్నది.

"అంటే ?"

"అంటే ఏముంది నాయనా ! నువు స్వామికి దణ్ణం పెట్టుకుని, దీపారాధన చేసుకుని ముడుపు కట్టుకోవాలి."

"వీలుపడదు."

"అయ్యో, పాపం ! నువు పసివాడివి. నీకు తెలీదు. ముడుపు కట్టుకోవాలి."

"అవును. మీరామాట అన్నారు. నేను కట్టుకోనన్నాను."

"ఎందుచేతా ?"

"కట్టుకోవటం ఎందుకూ ?"

"వెంకటేశ్వరస్వామి చెబితే తప్పుతుందా ?"

"వెంకటేశ్వరస్వామి ఎక్కడ చెప్పాడు ? సోది మనిషి చెప్పింది !....నేను చెబుతున్నానుగా, అక్కర్లేదని !"

"దానిరోగం నయంకావటం ఎట్లా ?"

"మందులిస్తే నయమవుతుంది."

"కాక పోయెగా ?"

"వేరేమందు లివ్వాలన్నమాట !"

"నువ్వట్లా చెబితే నేనేం చెప్పను ?....కన్నకడుపు నీదా, నాదా ?"

రామనాథం అత్తగారివంక తీక్షణంగా చూశాడు. ఆమెకు అల్లుడి రెండుకళ్ళలోనూ మూడోకన్ను జాడలు కనిపించినై.

అతనితో తనకేమిటని, సౌభాగ్యమ్మగారు వియ్యంకుడితోచెప్పి స్వామికి ముడుపు కట్టించింది. తరవాత వారంరోజుల్లో మహాలక్ష్మి కాస్త పక్కలో లేచికూర్చోవటం మొదలు పెట్టింది.

"ఆహా ! ఏడుకొండలవాడి మహిమ !" అన్నారు ఇంటిల్లిపాతీ.

ఈ మాట వినగానే రామనాథం పారిపోయినాడు.

"వెంకటేశ్వరస్వామి దేవుడైతే కావచ్చు. నేను మొక్కు చెల్లించబోవటం లేదు." అన్నాడతను.

ఈ మాట అతను అన్న అయిదు నిమిషాలకే మహాలక్ష్మికి ఒళ్ళు తెలియని జ్వరమూ, పణుకూ, మనిషి మంచంలో ఎగిరి ఎగిరి పడటమూ మొదలైనవి జరిగినై. అందరూ లబలబ లాడారు. భార్యను చూస్తున్న రామనాథం మొహం మరింత పాలిపోయింది. అతనిగుండె తన అసమ్మతిని చాలా గట్టిగా తెలియజేసింది. అతను పళ్లు బిగబట్టి, "నామీదకోపం దానిమీద తీర్చుకుంటాడా? తుచ్ఛుడు!....నేను మొక్కు చెల్లించను" అన్నాడు.

* * *

'రాబొయ్యేఫిలిం ట్రెయిలర్ వేస్తున్నారు. అసలు ఫిలింఇంకా ప్రారంభం కాలేదు. త్వరగా వెళ్ళండి" అన్నాడు బుకింగు ఆఫీసు గుమస్తా.

రామనాథం హాలులోకి వెళ్ళాడు. లోపల కటిక చీకటిగా ఉన్నట్టుంది అతని కళ్ళకు, అప్పుడే వెలుగులోనుంచి రావటంవల్ల. హాలంతా కిటకిట లాడుతున్నది. అతను కుర్చీల మధ్యగా, మనుష్యుల మధ్యగా దారిచేసుకుంటూ, ఖాళీకుర్చీ ఎక్కడ కనబడుతుందా అని చూసుకుంటూ నడవసాగాడు. కొంతదూరం వెళ్ళినతరువాత ఎవరో పెద్దమనిషి పొగరుగా "ఉండు అట్లా!" అంటూ అతన్ని అటకాయించాడు. ఆయన అడ్డం పెట్టిన కాలు రామనాథం చూడలేదు. ఆ కాలుతగిలి అతను ముందుకు తూలాడు. పడకుండా ఉండటానికి అతను తనచెయ్యి అవతలి కుర్చీలో కూర్చున్న మనిషిభుజంమీద వేశాడు. మరుక్షణం చెయ్యి తీసి నిదానుగా నుంచున్నాడు రామనాథం. కాని అపచారం జరిగిపోయింది. ఈ పెద్దమనిషిపక్కన కూర్చున్నదెవరో ఆడమనిషి! తనకు కాలు అడ్డం పెట్టిన

పెద్దమనిషి తాలూకేనేమో! అందుకనే ఆయన అతన్ని అట్లా గదమా యించాడు. ఆడవాళ్ళను తెచ్చి మగవాళ్ళలో కూర్చోపెట్టట మెందుకు? ఇంత గలభా ఎందుకు?

ఈ లోపల ఆ పెద్దమనిషి రామనాథంచేసి దిద్దుకున్న తప్పు గమ నించి "ఎవడ్రా నువు! బుద్ధిలేదూ?" అంటూ లేస్తున్నాడు. వెనకనించి "ఊరుకోండి! పోనివ్వండి!" అని అనునయింపులూ, "కూర్చో! కూర్చో!" అని గదమాయింపులూ వినిపించినై. రామనాథం ఆ పెద్ద మనిషి చెయ్యి పట్టుకొని బలవంతాన కుర్చీలో కూర్చోపెట్టి తను ముందుకు వెళ్ళాడు. అది మాటలకు సమయం కాదు.

ఈపాటికి అతనికళ్ళు చీకటికి అలవాటు పడినై. ఆ ఆడమనిషి పక్కకుర్చీ ఖాళీగానే ఉంది. హాలు కిటకిట లాడుతున్నా, ఆడదాన్ని గౌరవించి పక్కకుర్చీ ఖాళీగా ఉంచారు. తనకు మరి తప్పదు. అతను ఆమెపక్కన చదికిల బడ్డాడు.

"నువ్వా?" అంది ఆమె ఆశ్చర్యంతో.

"సావిత్రీ!" అన్నాడు రామనాథం. అతని వళ్ళు జల్లుమన్నది. లైట్లు వెలిగినై.

* * *

సావిత్రిని ఇంతకాలానికి చూసిన ఆశ్చర్యంలో రామనాథం ఆమె పక్కన ఉన్న పెద్దమనిషిని పూర్తిగా మరిచి పోయినాడు. తను ఆమెతో మాట్లాడటం ఇంకా పందమంది చూస్తున్నారన్న విషయం కూడా అతన్ని బాధించలేదు!

"ఎక్కడుంటున్నావు? మీ అత్తవా రేవూరు?" అన్నాడతను.

"ఇప్పుడు ఇక్కడే ఉంటున్నాను — మావాళ్ళింటో. మా అమ్మకు కొంచెం సుస్తీచేసి, ఇప్పుడు నయంగా ఉంది" మిగతాది సావిత్రి ఒక చిన్న యాక్షనుతో పూర్తిచేసింది, తల ఆ పెద్దమనిషివంక విసిరి. రామ

నాథం ఆశ్చర్యంతో ఆయనకేసి చూశాడు. ఆ పెద్దమనిషి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆయన మొదటినించీ అతనివేపే చూస్తున్నాడు — తను ఈ సంభాషణలో కల్పించుకుంటే సమంజసంగా ఉంటుందా, ఉండదా అని అనుమానిస్తూ.

ఆయన ఆమె భర్త అయిన రిటైర్డు తహసీల్దారు గారని రామ నాథానికి ఒక నిమిషం దాకా తట్టలేదు.

"ఓ!" అన్నా డతను అర్థమైనట్టు.

సావిత్రికి ఈ మొగుడేమిటి? అతనికి మొదట నవ్వొచ్చింది. తరవాత తట్టింది, సావిత్రికి ఆ మొగుడు హాస్యకారణం కాకపోవచ్చు నని. ఈ పెళ్లిళ్లేమిటి — పగకొద్దీ చేసినట్టు! అసురబుద్ధి! అదీ కారణం, ఈ ప్రపంచం ఇట్లా తలకిందుగా వెళ్ళుతూండటానికి కారణం!

పైకి బాగానేఉంది సావిత్రి పని. ఏదో అందమైన చీర కట్టింది. బోలెడు నగలు పెట్టుకుంది. చక్కగా బంగారపు బొమ్మల్లే ఉంది. అదృష్టవంతురాలేనేమో!

తిరిగిలైట్లు ఆరిపోగానే సావిత్రి తనచేతిని చల్లగా అతని చేతులో పెట్టింది! దాంతో కొంపలు అంటుకున్నై!

నీరసంగా ఉన్న అతని జీవితంలోకి సారం వచ్చినట్టయింది. కటిక చీకటిలో మతాబా వెలిగించినట్టయింది. అతని ప్రతి నరంలోకి ఎక్కడినించో జీవశక్తి వచ్చి ప్రవహించటం మొదలుపెట్టింది. ఆ చేతిని అతను చాలాసేపు పట్టుకున్నాడు....

మర్నాడు పోస్టులో అతనికి సావిత్రి దగ్గిర్నించి ఉత్తరమొచ్చింది.

"నాప్రాణదాతకు — నిన్న నిన్ను చూడగానే నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. కొంతకాలంనించీ నేను ఒకవిధమైన మత్తులో ఉన్నా నని నాకిప్పుడు అర్థమవుతున్నది.

"ఇది తప్పు, నేనీపని చెయ్యగూడదు' అని నాకు నేను ఎంతో నచ్చజెప్పుకో జూచాను. లాభం లేకపోయింది. నేను నిన్ను విడిచి ఉండ లేను. నువు నాకు కావాలి. నాలో ప్రతి నలుసూ నీకోసం తహతహలాడు తున్నది. ఇవాళ సాయంకాలం ఐదు గంటలకు రా! తప్పకుండా రావాలి!"

ఇక ప్రపంచం ఎట్లా పోతేఏం? ఏది ఎట్లా అయితే ఏం? ఎవరు ఏమయితే ఏం? ఇదంతా మాయ. సావిత్రి ఒక్కతే చైతన్యంగల జీవి. ఏఇతర పదార్థంలోనూ, జీవం ఉన్నట్టు కనిపిస్తుందేకాని, నిజంగా లేదు!

అతను దీపాలు పెట్టేవేళ ఇంటికి తిరిగి వచ్చాడు. అతని శరీరం దేవతా స్పర్శచేత పవిత్రమైనట్టుగా ఉంది. అతని కళ్ళు మెరుస్తున్నై. అతని మొహం కళకళ లాడుతున్నది. అతను మారిపోయినాడు.

"కాస్త ఒప్పుకుందూ, నాయనా! పిల్లది బాధతో అల్లాడి పోతు న్నది!" అన్నది అత్తగారు అతన్ని సావిట్లో పట్టుకుని.

"వెంకటేశ్వర స్వామికి నువ్వుకూడా ముడుపుకట్టి, అపరాధం అను!"

"అట్లాగే చేతాంలెండి!" అంటూ అతను గదిలోకి వెళ్ళాడు.

* * *

రాత్రి పదకొండు గంట లయింది. రామనాథం పక్కమీద డేరామేకల్లే కూర్చుని మొహం చిట్లిస్తున్నాడు. అతనికి నిద్ర రావటం లేదు.

ఏదో పొరపాటు జరిగింది. లేకపోతే అతను, మర్నాడు వెంక టేశ్వర స్వామికి ముడుపు కట్టి అపరాధం అనటానికి ఎట్లా అంగీక రించాడు? అతని పట్టు ఏమైంది?

సావిత్రి తనలో కలిగించిన మార్పు సొంతంగా మంచిదేనా? తను ఇప్పుడు ఈతరాకుండా కాలువల్లో దిగగలడా? గొడుగులు పట్టుకుని ఇంటిమీదినుంచి దూకగలడా? అటువంటి చిలిపి పనులు చెయ్యాలని

కాదు. తనలో ఇప్పుడా సాహసం ఉందా? తనకు ప్రాణం కొంచెం రుచికాలేదా? — సావిత్రి కోసం!

ఇంతకాలమూ తనలో ఒక గొప్ప శక్తి ఉంటూ వచ్చింది... దానితో అతను సాధించినది ఏమీలేదు. అయినా ఇప్పుడది నశించి పోతుందని అతనికి భయంగా ఉంది. ఉన్న శక్తిని వినియోగించక పోవటం తన పొరపాటు. ఇప్పుడు దాన్ని నశించనివ్వటం మరొక పొరపాటు! ఏం చెయ్యాలి తను?

కావాలంటే ఈక్షణంనించి తను సావిత్రిని చూడకుండా ఉండ గలడా? ఎందుకు చూడకుండా ఉండాలనేది అనవసరం! పట్టుదల కోసం!....ఇతర కారణాలూ లక్ష కలగవచ్చును. తన్ను రానివ్వటంవల్ల సావిత్రికి ఏ క్షణమయినా హాని కలగవచ్చును. సావిత్రి రేపో ఎల్లుండో చచ్చిపోవచ్చును. తను ఆ దెబ్బకు కుంగి పోవలసిందేనా? నూరు నోములు ఒక్కరంకుతో పోయినవన్నట్టు, ఒక్కసారి సావిత్రి దగ్గిరికి వెళ్ళినందుకే తనశక్తి ఇంత క్షీణించిపోతే, ఇంకొక నెలరోజుల్లో తన సంగతి ఏముందీ?....ఇప్పటికింకా మించిపోలేదేమో! తాను త్వరగా మేలుకుని కర్తవ్యం ఆలోచించాలి.

ఆ రాత్రి అతను నిద్రపోలేదు.

మర్నాడు సాయంకాలం అతను వెళ్ళేటప్పటికి సావిత్రి అతని కోసం నిరీక్షించుతున్నది. అతని మొహం చూడగానే ఆమె గ్రహిం చింది, ఏదో జరిగిందని.

"ఏమయింది?...."

"పొరపాటు జరిగింది, సావిత్రీ!"

"ఏం?"

"నాకు భయంగా ఉంది!"

"ఎందుకూ?"

"కొంతకాలం ఇట్లా జరిగితే నేను నిన్ను కావాలన్నా చూడకుండా వుండలేనేమో అని!"

ఆడదయినా ఆముక్క అర్థం చేసుకున్నది సావిత్రి.

"నాలో ఏదో నశించిపోతున్నదని భయం! స్వార్థం! నాకు తెలుసును! కాని. ఏది స్వార్థంకాదు? నేను నిన్నుకోరటం స్వార్థంకాదూ?"

సావిత్రి మాట్లాడ లేదు.

"నా హృదయం చాలా దుర్బలమయినది, సావిత్రీ! అది నాతో ఎన్నడూ కలిసి రాలేదు. నేనేది చెయ్యబోయినా అది అడ్డపుల్ల వేస్తూనే వుంటుంది. చివరకు దాన్ని ప్రతిఘటించటమే ఒక నియమంగా పెట్టుకున్నాను....ఎందుకూ? ఇప్పుడు నా హృదయం నన్నెంత నిర్బంధ పెడుతున్నదీ — నిన్ను నా చేతుల్లోకి తీసుకుని గట్టిగా కౌగలించుకోమని, నీ లేతబుగ్గలు కందేటట్టు ముద్దు పెట్టుకోమని!...." అతను మొహానికి చేతులు ఒత్తుకుని కొద్దిగా ఏడిచాడు.

ఆ క్షణంలో సావిత్రి అతన్ని సమీపించి, తనచెయ్యి మెల్లిగా అతని భుజంమీదవేస్తే ఏమయివుండునో!....సావిత్రి కూర్చున్న చోటినించి కదలలేదు.

ఇద్దరు అయిదునిమిషాలపాటు మౌనంగా కూర్చున్నారు.

"నా శరీరాత్మలు నీ చేతిలో పెట్టటంవల్ల నాకు పొయ్యేదేదీ కనిపించదు, ఎంత ఆలోచించినా! మగవాడికీ ఆడదానికీ అదొక భేదమేమో!" అంది సావిత్రి.

మొహానికి చేతులు అడ్డంతీసి, ఆమెవంక చాలాసేపుచూసి రామనాథం, "నేను నిన్ను ప్రేమించటంలో నాకు నా భార్యమీదగల అసహ్యమూ, నీ భర్తమీద కోపమూ — ఈ రెండూకూడా పనిచేస్తున్నై. అట్లా కాకుండా నా హృదయాన్ని నేను జయించగలిగిన తర్వాత మనిద్దరం కలిసివుందాం! ఏం, సావిత్రీ!"

"అట్లాగే !"

"అందాకా ఒకళ్ళ నొకళ్ళు చూసుకోనైనా వద్దు !"

"వద్దు !"

"నీకీ ఏర్పాటు కష్టంగా వుండదు కదా ?"

"ఉంటుంది !" సావిత్రి నవ్వింది. "నేను కష్టాలకు అలవాటుపడ్డ ప్రాణాన్నే !"

రామనాథం "వస్తాను" అని లేచాడు. అతని హృదయం తీవ్ర మయిన తన తుదిప్రయత్నం ప్రారంభించింది. రామనాథం దానికి లొంగ దలచుకోలేదు.

ఎటు పోతున్నాడో, ఏంచేస్తున్నాడో అతనికి తెలియదు. దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరుకున్నాడు. ఎవరితోనూ మాట్లాడకుండా అతను తనగదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

అతనికి శరీరంలో అస్వస్థతగా వున్నట్టు తోచింది. శరీరం వేడిగా లేదు. నాడిమాత్రం విపరీతంగా కొట్టుకున్నది. మతిచెడ్డవాళ్ళకు మల్లే ఆలోచన ఒక్కక్షణం ఒక్కచోట వుండక సంచారం చేస్తున్నది. చెవులో ఎవరో గుసగుస లాడుతున్నట్లున్నది.

"చాలా క్రూరం !....అయినా, పాపం, సావిత్రి ఏం పాపం చేసింది ?....స్వార్థం ! స్వార్థం ! అపరాధం !....వెంకటేశ్వరస్వామికి మీదుకట్టు !....నెత్తి అడుస్తాడు ! .... సావిత్రి మొహం చూడకు ! .... అమృతం విషమయింది, ఖర్మం చాలకపోతే !....పాపం, మొహమ్మీద కొట్టినట్టు —"

రామనాథం మూలిగి, పక్కమీద పొర్లాడు. కాని, ఒక్కక్షణం కదలకుండా పడుకోగానే కలవరింతా, మగతా, చెవుల్లో సంభాషణా !

"నీకే వుందనుకున్నావు, మొండితనం !....సావిత్రి నీ తల తన్నింది !....చూడు ఎంత సులభంగా నీమొహం చూడకుండా వుండ

టానికి ఒప్పుకుందో! ఆ మనిషి నీకోసం పుట్టిందని తెలియటం లేదూ? ఇట్లాగా ఆమాట రుజువు చెయ్యటం?..."

అతని తల్లివచ్చి కొడుకును భోజనానికి లేపింది. అతను పలక లేదు. తట్టిలేపినా పలకలేదు. శరీరం వేడిగాలేదు. ఊపిరి బలవంతంగా పీలుస్తూ విడుస్తున్నాడు. ఏమిటా ఈ అవస్థ అని ఆవిడ ఆశ్చర్యపడు తుండగా అతను కలవరించాడు.

"సావిత్రి పిరికిదనా?...భలే మొండిది!...నా అభిప్రాయం ఎంతబాగా అర్థంచేసుకుంది!...నా ప్రాణం!"

అతని గొణుగుడు ఆమెకు ఒక్క రవ్వయినా అర్థం కాలేదు. ఆమె వియ్యపరాలిని పిలిచింది. ఆవిడవచ్చి పరిస్థితులుచూసి వెంటనే వెంకటే శ్వర స్వామికి ముడుపుకట్టించి అపరాధం చెప్పించింది.

నాలుగు రోజులైన తరవాత సావిత్రికి తెలిసింది, రామనాథం యొక్క అర్థంలేని జబ్బుసంగతి. ఆమె వెంటనే రామనాథాన్ని చూడ టానికి ప్రయాణమయింది.

ఆమెనుచూసి రామనాథం అత్తగారూ, తల్లీ ఆశ్చర్యపోయినారు. ఆమె నేరుగా రోగివున్న చోటికి వెళ్ళింది. రామనాథం పక్కమీద వెల్లకిలా పడుకుని కప్పువంక అర్థంలేకుండా చూస్తున్నాడు.

సావిత్రి అతని పంటిమీద చెయ్యివేసి "ఇటు చూడు!"అంది.

"అపరాధం!" అన్నాడతను ఇంటికప్పుతో.

"నేను సావిత్రిని. నావంకచూడు, రామనాథం!"

"చచ్చిపోయింది! హత్య చేశాను! వెంకటేశ్వర స్వామివారు చేయించాడు!"

"ఇదుగో, చూడమ్మాయి! మా అల్లుడు 'సావిత్రి' అని కలవరిస్తాడు, నిన్నేనా?" అన్నది సౌభాగ్యమ్మగారు వెనకనించి.

"కావచ్చును!"

"ఎందు కల్లా?" అన్నది సౌభాగ్యమ్మగారు మంచి లాయరు ప్రశ్న వేసినదానిమాదిరిగా.

సావిత్రికి ఏం చెప్పాలో తెలియ లేదు.

"మా యిద్దరిదీ ఒకటే ప్రాణం!" అన్నది సావిత్రి తెగించి.

"అట్లాగా? అయితే అతని ప్రాణం మీదికి వచ్చింది. ఏం చేస్తావో చెయ్యి!" అన్నది రామనాథం అత్తగారు.

"ఛీ! అవతలికి పో నువ్వు!....పో!" అని రామనాథం ఇల్లు ఎగిరిపొయ్యేట్టు అరిచాడు. సౌభాగ్యమ్మగారు దడుసుకొని పారిపోయింది.

"నాకు పళ్లు తెలిసేవుంది. సావిత్రీ! మధ్యమధ్య మెదడు దాని యిష్టం వచ్చినట్టు పోతుంది. అర్థంలేని మాటలు అన బుద్ధి అవుతుంది"

"కాకూడదు" అంది సావిత్రి.

"లాభంలేదు సావిత్రీ! ఇట్లా అయితే నాకు పిచ్చి ఎత్తి పోతుంది ....నేను నిన్నువిడిచి ఉండలేను!" అతను ఆమెవేపు చెయ్యి చాచాడు. ఆమె అనుమానిస్తూ చెయ్యి అందించింది. అతను ఆమెను ఏనుగబలంతో లాగి ఆమె మొహం తనచేతులతో పట్టుకుని ఆమెకు ఊపిరి సలపకుండా ముద్దు పెట్టుకున్నాడు.

"ఉండండి! మీరట్లా ఇంద్రియ నిగ్రహం పోగొట్టుకోవటం బాగాలేదు. మీరు ప్రయత్నం చెయ్యటం లేదు, నన్ను మరిచిపోవాలని. ఇట్లా అయితే—"

రామనాథం ఒక బలమైన ముద్దుతో ఆమె మాటల ప్రవాహం ఆపేశాడు. ఎవరైనా వస్తారనికూడా అతనికి భయం లేదు. ఏమి చెయ్యాలో ఆమెకు తోచలేదు. ఈ ప్రవాహంలో పడి తనుకూడా కొట్టుకుని పోవాలా? అదెంతసేపు పని? అతని ముద్దులు ఆమె రక్తాన్ని ఉడికించటంలేదా? ఆమె కింతకన్న స్వర్గం ఏముంది? అతనికో?...

అతని పట్టు విడిపించుకుని, ఆమె "ఇంటికి పోవాలి!" అన్నది.

"అప్పుడే పోతావా ? నా జబ్బు ఎంత నయమయిందో చూశావా?"

"మళ్లీ సాయంకాలం వచ్చి చాలాసేపు కూర్చుంటాను !"

"ఈ గ్రహాలన్నీ – ఇక్కడ కాదు; నేనే మీ యింటికి వస్తాను. ఏం, సావిత్రీ ?"

సావిత్రి ముక్కుమీద వేలుపెట్టుకుంది. అతను లెక్కచెయ్యలేదు.

"నేను రాలేననా ? రాగలను !"

"నేను వస్తాను కాదూ ? వస్తానని రానా ?"

"అయిదు గంటలకు రా ! రాకపోతే నేను ఇంతదూరమూ నడిచి వస్తాను సుమా !"

"అట్లాగే !" ఆమె ధైర్యంచేసి, అతన్ని సమీపించి, వంగి, అతని కళ్లరెండూ ముద్దుపెట్టుకుని, ఇవతల పడ్డది. ఏం చెయ్యాలో ఆమె అప్పుడే తీర్మానించుకుంది.

ఆ సాయంకాలం ఆరింటికి ఒక నీరసంగా ఉన్న వ్యక్తి బలవంతాన నడుస్తూవచ్చి సావిత్రి పుట్టింటివారి ఇంటి అరుగుమీద చతికిలబడ్డది.

ఆ ఇల్లు తాళంపెట్టి ఉంది !

* * *

ఆరునెలలు గడిచినై. రామనాథం తన గుడ్డిభార్యతో వేరే కాపరం ఉంటున్నాడు. ఈ ఆరునెలల్లోనూ చాలా గ్రంథం జరిగింది.

మహాలక్ష్మి జబ్బు కొంత నయమై లేచి అటూ ఇటూ తిరుగుతుండగా ఆమెకు మశూచికం పోసి రెండుకళ్లూ పువ్వేసిపోయినై.

ఈలోపల రామనాథంలో పెద్ద పరివర్తన కలిగింది. భగవంతుడు తనకు ప్రసాదించిన మొండితనాన్ని ఉపయోగించటానికి అతను ఒక మార్గం కనిపెట్టాడు.

మంచి అలవాట్లు అభ్యసించినట్టు సద్గుణాలు మాత్రం ఎందుకు అభ్యసించరాదూ ? తన భార్యా ఎటువంటిదైనా సరే, ఒక కుక్కను,

ఒక పిల్లిని దయతో చూచినట్టు, దయతో, ప్రేమతో మహాలక్ష్మిని చూడటం అసంభవమా తనకు? ఎంత కష్టమైనా సరే ప్రయత్నం చేసేటందుకు తనకు పట్టుదల ఉంది — అసంభవం కాకపోతే సరి! లేదా, తనలో అంత మొండితనం లేదని రుజువైనా కావాలి!....

అతను ప్రయత్నం చేసి తనభార్యమీద ప్రేమా, జాలీ, దయా తెచ్చిపెట్టుకున్నాడు. ఇటువంటి పని చేసినవాడు ప్రపంచం మీద మరొకడున్నాడని చెప్పలేం! మొదట్లో ఈపని అతనికి చాలా కృత్రిమంగా, హాస్యాస్పదంగా తోచింది. కాని అతను పట్టు విడువలేదు. కావాలనేటప్పటికి అతనికి ఎక్కడలేని ఓర్పూ వచ్చింది. ఆమె అవక తవక మాటలూ, వంకరబుద్ధీ సహించడం మొదలుపెడితే, అందులోనూ కొంత ఆనందం కనబడ్డది. కాని అతని ప్రయత్నానికి అతని తల్లిదండ్రులు పెద్ద అంతరాయం అయిపోయినారు.

ఏం చెయ్యాలి తను? ఆ ముసలివాళ్ళకు తన అభిప్రాయం అర్థం కాదు. తనతల్లి ఒకసారి అనుకుంటున్నది — బిగ్గరగా — "ఇంకేముందీ? అది వాణ్ణి బాగా తన వల్లో వేసుకుంది!" అని. భూతదయ తన భార్యయందే ఎటువంటి మార్పు తెచ్చిపెడుతుందో చూడటం ఎట్లా, అటువంటి తల్లిని ఇంట్లో పెట్టుకుని?

బాగా ఆలోచించి అతను వేరే కాపురం పెట్టాడు. ఈ నాలుగు నెలల్లోనూ మహాలక్ష్మి ఎంతో మారిపోయింది.

ఆమెలో కలుగుతున్న మార్పులన్నీ అతను గమనిస్తూనే ఉన్నాడు. మొదట్లో ఆమె అమితంగానూ, అప్రియంగానూ మాట్లాడేది. తన కళ్ళు తన మొగుడే పోగొట్టాడని రోజుకు పదిసార్లు అనేది. వెంకటేశ్వర స్వామిచేత పోగొట్టించాడనేది.

క్రమంగా ఆమె ధోరణి తగ్గిపోసాగింది. ఆమె మాట్లాడటం తగ్గించి ఆరిపోయిన దీపాలవంటి తన కళ్ళతో ఆలోచించటం ఎక్కువ

చేసింది. అలవాటు చొప్పున మాట్లాడటం మొదలు పెట్టినా మధ్య మానేసి ఆలోచనలో పడేది.

ఇంకా రోజులు గడుస్తున్నకొద్దీ ఆమె తనభర్తకు పని ఇవ్వటాని కూడా సంకోచిస్తున్నట్టు కనపడటం మొదలు పెట్టింది. మంచంలో లేచి కూర్చుని చాలాసేపు అనుమానించి "ఏం చేస్తున్నారు?" అని అడిగి, "వీలయితే నన్ను ఒక్కసారి బయటికి తీసుకు పోతారూ?" అనేది. ఇటువంటివి అతను గమనించకుండా ఎట్లా ఉండగలడు? అతని కాలి చప్పుడు గుర్తుపట్టేది. రెండు మూడు గంటలు అతను ఇంట్లో లేకుండా ఎక్కడికైనా వెళ్ళి రాగానే, అతనికోసం నిరీక్షిస్తున్న దానల్లే అతను వచ్చిన అలికిడి విని మంచంలో లేచి కూర్చుంటుంది. ఆమె మొహాన సంతోషం కనబడుతుంది. ఒక్కొక్కరాత్రి అతన్ని తన మంచం మీద కూర్చోమని అతని చెయ్యి తనచేత్తో పట్టుకుని అట్లాగే నిద్ర పొయ్యేది. ఒకసారి అతను తన్ను తగ్గిరికి తీసుకుని తన నుదురు ముద్దుపెట్టుకొంటే ఆమె శరీరం గట్టిగా జలదరించింది...

మనిషిలో ఇంత మార్పా? ఆ మార్పు కలిగించటానికి ఇదా విధానం? అతను ఆశ్చర్యపడ్డాడు, సంతోషించాడు.

అతనికి పని చెప్పటం ఇష్టంలేక ఆమె ఒకసారి తనంతట తానే దొడ్లోకి పోవాలని బయలుదేరి, దారిలో ఏదో తగిలి పడ్డది. మోకాలు డోక్కుపోయింది. రామనాథం ఆ చప్పుడు విని చేస్తున్నపని విడిచిపెట్టి వచ్చి, ఆమెను చేతుల్లో ఎత్తుకుని, మృదువుగా "దెబ్బతగిలిందా లక్ష్మీ!" అన్నాడు. "మోకాలికి తగిలింది" అన్నది, మోకాలు అందుకోవాలని ప్రయత్నం చేస్తూ. అతనికి గాయం కనపడ్డది. "అయ్యయ్యో!... నెప్పిగా ఉందా?" అన్నాడతను గాయంచూసి గాభరాపడి.

ఆమె అతని చెంప స్పృశించి నవ్వుతూ "ఇప్పుడు లేదులెండి!" అన్నది.

రామనాథం పూర్తిగా తృప్తిపడ్డాడు. అతని విజయం పూర్తి అయింది. అతని హృదయం ఇప్పుడు ఎక్కడ ఉందో 'పత్తా' లేదు. ఉక్కిన పేనయిపోయింది. మిన్ను విరిగి మీదపడ్డా ఇప్పుడది కిక్కురుమనదు...అంతా సావిత్రి ప్రసాదం! అప్పుడామె తన్ను విడిచిపెట్టి వెళ్ళకపోతే తను ఇంతపని చెయ్యగలిగి ఉండడు! ఎందుకూ? తనకు తనలో నమ్మకంకూడా పోయింది, సావిత్రికోసం తను మతి చెడగొట్టుకొన్న రోజుల్లో. సావిత్రికి తను యావజ్జీవం కృతజ్ఞుడై ఉండవచ్చును.

ఒకనాడు రామనాథం భార్యతో సావిత్రిని గురించి యావత్తూ చెప్పాడు. ఆమె గంభీరంగా అంతా విని చాలాసేపు మాట్లాడలేదు.

"పాపం! అప్పుడామెను అట్లా ఎందుకు వదిలేశారు?" అన్నదామె చివరకు.

"నిన్నూ, సావిత్రి మొగుణ్ణీ ఒక చెంప ద్వేషిస్తూ నేను సావిత్రితో సుఖపడటానికి ఇష్టపడలేదు. ఆ స్థితిలో నేను సావిత్రిని వదలలేకపోవటం నా హృదయానికి దాస్యం చెయ్యటం అయింది. నా హృదయం మొదటినుంచీ నా పట్టుదల మీద కన్నువేసి ఉంది! ..అందుకని!" అన్నాడతను భార్య తలనిమురుతూ.

* * *

సాయంకాలం అయిదుగంటలయింది. అతను బజారుకువెళ్ళి అప్పుడే తిరిగివచ్చాడు. లోపలికి వచ్చి "లక్ష్మీ!" అని పిలిచాడు. ఇంట్లో ఉన్నట్టులేదు. ఉంటే తన అడుగుల చప్పుడుకు మెల్లిగా ఎదురువచ్చేదే! మంచం దగ్గిరికి వెళ్ళి చూశాడు నిద్రపోతున్నదేమోనని. అక్కడా లేదు. ఒంటరిగా దొడ్లోకి వెళ్ళిందేమో!

అతను దొడ్లోకివెళ్ళి ఒకటి రెండు కేకలు పెట్టాడు. పొట్లపాదు పక్కనించి మూలుగు వినపడ్డది. అతను అక్కడికి పరిగెత్తి బొక్కబోర్లా పడి ఉన్న భార్యనుచూసి, గాభరాపడుతూ ఆమెను లేవదీశాడు.

ఆమెకు స్పృహలేదు. ఏమయిందో అతనికి అర్థం కాలేదు. చుట్టూ చూశాడు. నేల మీద ఏవో పశువుల అడుగు జాడలు కనపడినై. ఏ పొగరుబోతు గొడ్డయినా దొడ్లో ప్రవేశించి, ఆమెను వెనకనించి కుమ్మి పడదోసిందేమో!

భార్యను మెల్లిగా లోపలికి మోసుకునివచ్చి మంచంమీద పడుకో బెట్టాడు రామనాథం. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సరిగానే ఉన్నై. గుండె సరిగానే కొట్టుకుంటున్నది. ఎక్కడా గాయంకూడా అయినట్టు లేదు. భయంచేతా, పాటుపల్లా స్పృహతప్పి ఉంటుంది. అతను కాసిని చన్నీళ్లు తెచ్చి ఆమె మొహాన కొట్టాడు. ఆమె పెద్ద నిట్టూర్పు విడిచి కదిలింది. ఆమె గొంతులో కాసిని నీళ్ళు పోశాడు. ఆమెకు దాంతో స్పృహ వచ్చింది.

"ఏం జరిగింది, లక్ష్మీ?" అన్నాడతను.

ఆమె జవాబు చెప్పలేదు. అతనికి కారణం అర్థంకాలేదు. ఆమెకు స్పృహవచ్చిందనీ, మేలుకుని ఉందనీ, విశేషం దెబ్బతగల్లేదనీ అతనికి తెలుసును. అతనిమాట వినపడగానే ఆమె మొహంలోకి రావలసిన వికాసం రాలేదు. గుడ్డితనానికి తోడు, పాపం, చెముడు కూడా రాలేదుకదా!

ఇంకా బిగ్గిరిగా పిలిచాడు.

"ఉఁహూ!" అన్నది మహాలక్ష్మి, పలకరించవద్దు అన్నట్టు. ఆమె గొంతుకూడా చాలా విచిత్రంగా, అమానుషంగా ఉంది. అతను ఆమె జోలికిపోక ఎడంగావచ్చి తనపని చూసుకోవటం మొదలు పెట్టాడు. మరికాస్సేపటికి వంటమనిషివచ్చి వంటచెయ్యటం మొదలు పెట్టింది.

అతను భోంచెయ్యటానికి లేవబోతుండగా వంటమనిషి "అమ్మాయిగారుకూడా ఇప్పుడు భోంచేస్తుందా?" అని అడిగింది. "నా తరవాత" అని అతను సమాధానంచెప్పి, వెళ్ళి భోజనం చేశాడు. అతను

భోజనం పూర్తికాగానే లేచివచ్చి నిశ్చలంగా పడుకున్న భార్యనుచూసి, ఆమెకోసం ఎదురుచూస్తున్న వంటమనిషితో "మీరు భోంచెయ్యవచ్చును. లక్ష్మికి తరవాత నేనుపెడతాను" అన్నాడు. వంటమనిషి ఏవోప్రశ్నలు వెయ్యబోయిందికాని రామనాథం ఆమెను నిరుత్సాహపరచి పంపేశాడు.

పదిగంట లయింది. అతను కుర్చీలో కూర్చొని ఏదో చదువుకుంటున్నాడు. ఇంకా కాస్సేపుచూసి లక్ష్మి లేవలేకపోతే ఏమైనా సరే లేపుదా మనుకున్నాడు.

ఏదో చప్పుడు కావడంవల్ల అతని చదువుకు అంతరాయం కలిగింది. అతను లక్ష్మి మంచంవేపు చూశాడు. ఆమె మంచంమీద లేచి కూర్చుని ఉంది. అతను చూస్తుండగానే, ఆమె మామూలు మనిషల్లేలేచి మెల్లిగా తనవేపు నడిచిరావటం మొదలుపెట్టింది.

"అయ్యయ్యో! పడతావుసుమా! అక్కడే ఉండు, వస్తున్నాను." అంటూ అతను ఒకచేత్తో లాంతరు పైకెత్తి నిలబడ్డాడు. కాని అతని ఆందోళన అనవసరం అయింది. ఆమె కళ్లున్న మనిషల్లే అడ్డాలూ, అవీ తప్పుకుని నడిచివస్తున్నది. ఆమెకు సాయంత్రం కలిగిన పాటువల్ల కళ్లు రాలేదు కదా! కాని — ఆమె కళ్లు మూసుకునే నడుస్తున్నది. అతని కళ్లను అతనే నమ్మలేక పోయినాడు.

అతని కేక ఆమెకు వినపడ్డట్టు లేదు. ఆమె అతని దగ్గిరికి వచ్చి అతని భుజాలమీద చేతులు వేసింది. ఆమె కళ్ళు ఇంకా మూసుకునే ఉన్నై.

"లక్ష్మి!"

"ఊఁ!"

"నీకు — నీకు కనపడుతున్నానా?"

"ఊఁ!"

"నేను కనబడుతున్నానా?" అతని గొంతు చలించింది.

"ఆ!"

"ఏం కావాలి?"

సమాధానం లేదు.

"భోంచేస్తావా?"

సమాధానం లేదు.

అతనికి ఎన్నో ప్రశ్నలు వెయ్యాలనిపించింది. కాని ఒక్కటీ వెయ్యకుండా ఆమెవంక అర్థంలేని చూపు చూస్తూ అట్లాగే నిలబడి పోయినాడు.

"సావిత్రి మొగుడు పోయినాడు!" అన్నదామె వినపడీ వినపడని గొంతుతో.

"ఎప్పుడు?"

"నిన్న!"

"నీ కెవరు చెప్పారు?" అన్నాడతను ఉద్రేకం అణచుకోలేకుండా.

సమాధానం లేదు.

"నిజంగా పోయినాడా?"

"పోయినాడు!"

"పాపం!"

"సావిత్రిని తీసుకురండి."

"ఎక్కడికి?"

"సావిత్రికి మీరుతప్ప దిక్కులేదు, ముందు ముందు."

"ఇదంతా నీకెట్లా తెలిసింది?"

మహాలక్ష్మి సమాధానం చెప్పలేదు. ఆమె తనవంక చూస్తున్నట్టు నటించటం మానేసింది. ఆమె మెడ వేళ్ళాడ బడ్డది. ఆమె అతని మీదికి తూలిపడి కిందికి జారటం మొదలు పెట్టింది. ఆమెను అతను గట్టిగా పట్టుకుని తీసుకువెళ్ళి మంచంమీద కూర్చోపెట్టాడు.

"దాహం!" అంది మహాలక్ష్మి. ఇప్పు డామె గొంతు సహజంగా ఉంది. ఆమె వాలకం చూస్తే ఆమెకు ఇప్పుడే నిజంగా వళ్లు తెలిసినట్టు కూడా తట్టింది రామనాథానికి. అతను మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడు. ఆమె వాటిని ఒక్కగుక్కలో తాగేసి నిట్టూర్చింది.

"భోంచేస్తావా, లక్ష్మి?"

"వద్దండీ!....అబ్బ! వీపులో పోటుగా ఉందండీ!" అతను మెల్లిగా పడుకోబెట్టాడు.

"చల్లగాలికోసం నేను తడువుకుంటూ దొడ్లోకి వెళ్ళేటప్పటికి ఏదో వచ్చి నన్ను పడదోసింది!....నేను మిమ్మల్ని చూసినట్టు కల వచ్చిందండి! దీపం అట్లా చేత్తో పైకెత్తి పట్టుకుని నుంచున్నారు!.... ఆ తరవాత ఏమీ జ్ఞాపకం లేదు."

"అది కలకాదు, లక్ష్మి! దేవతలు నీకు దివ్యదృష్టి ఇచ్చారు." అని సమాధానం చెప్పాడు.

* * *

అప్పుడప్పుడూ మహాలక్ష్మి కళ్ళు మూసుకునే ఇల్లంతా తిరుగుతూ ఉంటుంది. రామనాథంగాని, సావిత్రికాని ఆమెను చూసి ఆశ్చర్య పడరు. ఆమెకు అడ్డం వెళ్ళరు!

—౦౦:౦:౦౦—